క్లుప్తంగా

విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం



తాడేపల్లి రూరల్: విద్యార్థి జీవితంలో 10వ తరగతి కీలకమైందని శ్రీ పట్టిల ముత్యాలమ్మ నాగభూషణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శ్రీధర్ అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరులో శ్రీ పట్టిల ముత్యాలమ్మ నాగభూషణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు టి. శ్రీధర్ మాట్లాడుతూ పరీక్షలలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో నిర్మాణ దాత పట్టిల శివశంకరరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గోపాలం సురేష్ బాబు పాల్గొన్నారు.

ఆదివారం కూడా రిజిస్ట్రేషన్ సేవలు

మంగళగిరి: నగర పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఈనెల 26వ తేదీ ఆదివారం పని చేస్తుందని సబ్ రిజిస్ట్రార్ షరీఫ్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తుల కొనుగోలు, విక్రయదారులు రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చునని కోరారు. మార్చి నెలాఖరు నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు బ్యాంకులు కూడా పని చేయనున్నాయని, ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

కొండ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు సన్నాహాలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో నివాసాలు కొండలపైన ఉండడంతో ఆ ప్రాంతాలకు తాగునీరు సరిగా సరఫరా కోసం శుక్రవారం బూస్టర్ మోటార్లను ఏర్పాటు చేస్తున్నారు. తాడేపల్లి కొండ ప్రాంతంలో నివసించే ప్రజలు తాగునీరు సరిగా సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎంటీఎంసీ అధికారులు బూస్టర్ మోటార్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొండ ప్రాంతాల్లోని యాదవుల బజార్, ఆనందరావు చర్చి, సలాం హోటల్ సెంటర్ బజార్లలో తాగునీరు సరఫరా చేసేందుకు బూస్టర్ మోటార్లు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ సిబ్బందికి సూచించారు. దీంతో తాడేపల్లి వాటర్ వర్క్స్ సిబ్బంది పనులు చేపట్టారు.

113 తాళ్లూరులో వైఎస్సార్ ఆసరా ర్యాలీ

ఫిరంగిపురం: వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ చేస్తున్న సందర్భంగా మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో శుక్రవారం పండుగ వాతావరణం నెలకొంది. డ్వాక్రా మహిళలు గ్రామకూడలిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంఘసభ్యులతో కోలాట ప్రదర్శన, డప్పువాయిద్యాలతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి చుక్కా రూతు, ఎంపీటీసీ సభ్యురాలు చేవూరి నాగవేణి, ఎంఎస్ సీసీ లక్ష్మి, యానిమేటర్లు, వీవోఏలు పాకనాటి శ్రీదేవి, యరసాని మరియమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు అందజేత

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచి మున్నంగి శివకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకున్న దానిలో తోటివారికి సాయం చేయాలని చెప్పారు. దాతలను ఒప్పించి సాయం అందించేందుకు కృషిచేసిన పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పి.రామిరెడ్డిని అభినందించారు. అనంతరం విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రీటామరియ, ఉపాధ్యాయుడు దివి.కమల్‌మోహన్, గ్రామస్తులు ఉమామహేశ్వరరెడ్డి, ప్రభాకర్, పద్మ పాల్గొన్నారు.

27న హుండీ కానుకల లెక్కింపు

మంగళగిరి: నగరంలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి, గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి(శివాలయం) హుండీ కానుకలను ఈనెల 27వ తేదీ లెక్కించనున్నట్లు దేవస్థానం ఇన్‌చార్జి ఈఓ ఎ.రామకోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను ఉదయం 9 గంటలకు లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో లెక్కించనున్నట్లు ఈఓ చెప్పారు.

పైపు లైన్‌కు మరమ్మతులు

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక రావిచెట్టు సెంటర్ వద్ద ఓవర్‌హెడ్ ట్యాంకుకు వెళ్లే పైప్‌లైన్ శుక్రవారం తెల్లవారుజామున పగిలిపోయింది. సమాచారం అందుకున్న ఇంజినీరింగ్ సిబ్బంది తాగునీటిని సరఫరా చేసే మోటారును నిలిపివేసి రెండు గంటలు శ్రమించి మరమ్మతులు నిర్వహించారు. పెనుమాకలో సురక్షిత తాగునీరు అందించే ప్రధాన పైపులైను రోడ్డు వెంబడి ఉండడంతో హెవీ వాహనాల తాకిడికి పైపులైన్లు పగిలిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. తాగునీటిని సరఫరా పునరుద్ధరించినట్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ రేవతి తెలిపారు.

అర్బన్ హెల్త్ సెంటర్లలో పూర్తిస్థాయి సేవలు

- వారంలో మూడు రోజులు ప్రత్యేక సేవలు
- పెరిగిన రోగుల సంఖ్య



నిడమర్రులోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్

మంగళగిరి: పేదలకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురాలని ప్రభుత్వం సంకల్పించింది. అందుకు అనుగుణంగా అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసింది. నగర పాలక సంస్థ(ఎంటీఎంసీ)లో తొమ్మిది వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసింది. ఇప్పటికే 8 ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచనలతో నగర పాలక సంస్థ నుంచి ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌కు రూ.80 లక్షలు పైగా కేటాయించి అన్ని వసతులు కల్పించారు. యర్రబాలెం, నిడమర్రు, రాజీవ్‌గృహకల్ప కాలనీ, గణపతినగర్, శ్రీలక్ష్మీనృసింహస్వామి కాలనీ, డొల్లాస్ నగర్, చినకాకాని, రామచంద్రాపురంలలో పూర్తి చేసుకుని పూర్తిస్థాయిలో ప్రజలకు వైద్య సేవలందిస్తుండగా కుంచనపల్లిలోని హెల్త్ సెంటర్ మరికొన్ని రోజులలో అందుబాటులోకి రానుంది. ప్రతి రోజు సెంటర్‌లో 80 నుంచి 100 మందికిపైగా రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. వారంలో మూడు రోజులు ప్రత్యేక డాక్టర్లు రోగులకు పరీక్షలు నిర్వహిస్తుండడంతో రోగులకు ఆదనపు సేవలందుతున్నాయి. వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లలో సోమవారం ఎముకల వైద్య నిపుణులు(ఆర్థోపెడిక్), మంగళవారం జనరల్ సర్జరీ, బుధవారం చెవి ముక్కు కన్ను(ఈఎన్‌టీ) వైద్యులు ప్రత్యేకంగా సందర్శించి రోగులకు పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందిస్తున్నారు.

పేదలకు వరం



ఇది వరకు చిన్న జ్వరం వచ్చినా మంగళగిరి వెళ్లాల్సి వచ్చేది. ఇక్కడ ఆస్పత్రి నిర్మించిన తర్వాత వెంటనే వైద్యం పొందుతున్నాం. అర్బన్ హెల్త్ సెంటర్లతో మాలాంటి పేదలకు మందులు ఇస్తున్నారు. పేదల గురించి ఆలోచించే జగన్‌మోహన్‌రెడ్డికి పేదలంతా అండగా నిలుస్తారు.

–ప్రసన్న, నిడమర్రు

అందుబాటులో వైద్యం



ప్రభుత్వ ఆస్పత్రి అంటే ఇదివరకు భయమేసేది. ఇప్పుడు కొత్త ఆస్పత్రికి వస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్యం అందుకుంటున్నాం. మాలాంటి పేదలకు ఇలాంటి ఆస్పత్రుల వలన డబ్బులు, సమయం ఆదా అవుతాయి. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కృషి అభినందనీయం.

–జి.అనూరాధ, యర్రబాలెం

సంక్షేమం, అభివృద్ధే ధ్యేయం

- పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త సురేష్‌కుమార్
- గరికపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



గరికపాడులో సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న కత్తెర సురేష్ కుమార్

గరికపాడు(తాడికొండ): సంక్షేమం, అభివృద్ధి ధ్యేయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాటు పడుతుంటే చంద్రబాబు అధికారం కోసం పాకులాడుతున్నాడని మండిపడ్డారు. పార్టీకి ద్రోహం చేసిన కలుపు మొక్కలను ఏరివేయడమే సముచితమని, అవకాశవాద రాజకీయాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని చెప్పారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా వందలాది మందికి రాజకీయ భిక్ష పెట్టిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అన్యాయం చేసిన వారు తగిన ఫలితం అనుభవించక తప్పదని హెచ్చరించారు. అవినీతి రహిత పాలన అందిస్తూ దేశం యావత్తు ఏపీ వైపు చూసేలా చేస్తున్న జగనన్న మరో 30 సంవత్సరాలు అధికారంలో ఉండటం ఖాయమన్నారు.

వైఎస్సార్ సీపీ పలువురు నాయకులు చేరిక

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గరికపాడులో టీడీపీకి చెందిన పలువురు నాయకులు వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ మాజీ ఉప సర్పంచి గరికపాటి వీరయ్య, గరికపాటి మోషె, గరికపాటి రామారావుతో పాటు పలువురు టీడీపీ నాయకులను నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, పార్టీ గ్రామ అధ్యక్షుడు తోకా వెంకయ్య, మాజీ అధ్యక్షుడు గద్దం మురారి, పులి పాటి మోహన్ రెడ్డి, వేల్పూరి పవన్ పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై పోషక విలువలు

ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ మనో రంజని



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

తాడేపల్లి రూరల్: చిరుధాన్యాలలో పోషకాలు పుష్కలంగా ఉంటాయని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.మనో రంజని అన్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పక్వాడా కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలతో పోషకాహార ప్రదర్శన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ప్రతిరోజూ చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవడం వలన శరీరానికి కలిగే ఉపయోగాలు ఎన్నో ఉన్నాయని అన్నారు. రాగులు, ఊదలు, సామలు, కొర్రలు, సజ్జలు, ఒరిగెలు, జొన్నలు ప్రతి నిత్యం ఆహారంలో ఏదో ఒక రూపంలో ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం పోషకాహార ర్యాలీ, మానవ హారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉమెన్ కమిషన్ సెక్షన్ అధికారి శ్రీమతి ఎస్‌పీఎస్ శైలజ, సీడీపీఓ న్యూరాణి, ఈమని ఎంపీటీసీ సాయి చైతన్య, సూపర్‌వైజర్లు ఎస్.భవాని, జ్యోతి, శకుంతల, రమణమ్మ, నాగమణి, డీఈఓ జ్యోతి, నాగరాజు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన



ఆత్మకూరు గణపతి నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మంగళగిరి: క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ వి.రాజేష్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగర పాలక సంస్థ పరిధి యర్రబాలెం డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ కె.లక్ష్మీ మనోహర్, ఏఎన్‌ఎంలు వాణి, ఎం.కృపమ్మ, యు.అరుణకుమారి, వి.జయశ్రీ, పి.గీత, కె.ఝాన్సీ రాణి, పి.భువనేశ్వరి, ఎం.శశి పాల్గొన్నారు.

ఆత్మకూరులో...

ఆత్మకూరు గణపతినగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో శుక్రవారం క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.అనూష ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో టీబీ హెచ్‌బీ శ్యామ్, టీబీ సూపర్ వైజర్ మూర్తి, హెల్త్ సెంటర్ సూపర్ వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తాడేపల్లి రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ అక్కుల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి మండలంలోని రిషింక హైట్స్ అపార్ట్‌మెంట్, అతిథి అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు నవులూరులో..

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు మక్కేవారిపేట, గోలివారితోట ఏరియాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేయనున్నట్లు డీఈఈ సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థి కనిపించడం లేదంటూ తండ్రి శుక్రవారం తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. విజయవాడకు చెందిన శివప్రసాద్ కుమారుడు మణి శ్యామ్, బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. యూనివర్సిటీలో గురువారం ఫంక్షన్ ఉండడంతో ఇంటిపక్కన వారిని కారు అడిగి తీసుకుని యూనివర్సిటీకి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో కారుకు ప్రమాదం జరగడంతో తండ్రి అయిన శివప్రసాద్ మందలించడంతో మనస్తాపం చెంది వెళ్లిపోయినట్లు తండ్రి శివప్రసాద్ ఫిర్యాదు ఇచ్చారని, జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

కత్తితో దాడి చేసిన భర్తపై కేసు

మేడికొండూరు: విడాకులు ఇవ్వాలంటూ భార్యపై కత్తితో దాడి చేసిన భర్తపై మేడికొండూరు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా కారెంపూడి మండలం ఇనుపరాజుపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వరిని అదే గ్రామానికి చెందిన సుంకరసుధాకర్ గత సంవత్సరం ఆగస్టులో వివాహం చేసుకున్నాడు. భర్త సుధాకర్ పేరేచేర్లలో పొక్లెయిన్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఈనెల 11న పేరేచర్ల డొంకలో భార్య రాజేశ్వరిని విడాకులు ఇవ్వాలంటూ దాడిచేసి గాయపరిచాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజేశ్వరిని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనోవికాసానికి ధ్యానం దోహదం

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'మనోవికాసానికి ధ్యానం' అనే అంశంపై అవగాహన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ధ్యాన శిక్షకులు జి. వెంకటరామయ్య, పిచ్చిరెడ్డి, శారద పాల్గొన్నారు. ధ్యానం విశిష్టతను భక్తులకు వివరించారు. మనోవికాసానికి, ఆరోగ్యాని దోహదం చేస్తుందని వివరించారు. సభ అనంతరం భక్తుల సందేహాల్ని వెంకటరామయ్య నివృత్తి చేశారు. కార్యక్రమంలో నూతలపాటి తిరుపతయ్య, మన్నె సుబ్బారావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య పాల్గొన్నారు.

వడ్డీలేని రుణాలు సద్వినియోగం చేసుకోండి



చిరు వ్యాపారులకు రుణాలు అందజేస్తున్న కరూర్ వైశ్యాబ్యాంక్ మేనేజర్ కరుణాకర్

మంగళగిరి: చిరు వ్యాపారులకు ఆర్థిక తోడ్పాటునందించేందుకు వడ్డీ లేని రుణాలు అందజేయడం అభినందనీయమని కరూర్ వైశ్యాబ్యాంక్ మేనేజర్ కె.కరుణాకర్ అన్నారు. మిద్దె సెంటర్‌లోని ఖిద్మత్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ కార్యాలయంలో శుక్రవారం చిరు వ్యాపారులకు వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమాన్ని కరుణాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, చిన్న చిరు వ్యాపారులకు ఖిద్మత్ సంస్థ ద్వారా వడ్డీలేని రుణం అందజేయడం వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. సంస్థ జిల్లా డైరెక్టర్ షేక్ శిలార్ మాట్లాడుతూ సొసైటీ ప్రారంభించిన సంవత్సర కాలంలోనే వెయ్యి మంది సభ్యులకు కుల, మతాలకు అతీతంగా రూ.95లక్షల రుణాలను అందించడం సంతోషకరంగా ఉందన్నారు. మరింత మంది సభ్యులు తమ సంస్థలో చేరి సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ షేక్ రఫీ, ఫీల్డ్ ఆఫీసర్ జీవన్ పాల్గొన్నారు.

యానాదుల కాలనీలో చీరలు పంపిణీ



చీరలు అందజేస్తున్న ట్రస్ట్ చైర్మన్ ప్రేమ్‌కుమార్

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని యానాదుల కాలనీలో వృద్ధులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోర్‌కార్నర్‌ట్రస్ట్ చైర్మన్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగంగా దాతలు అందించిన సహకారంతో బీదలకు, వృద్ధులకు చీరలు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జామెంట్రీ బాక్సులు అందజేస్తున్నట్లు చెప్పారు. ఉన్న ప్రభుత్వ మునిసిపల్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సత్యవేడు మాజీ ఎమ్మెల్యే బాబూరావు, హైకోర్టు అడ్వకేట్ కె.అరుణ్ కుమార్, లెక్చరర్ ఎ.అరుణకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజకుమారి, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణఅధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, ట్రస్ట్ మహిళా నాయకురాలు ఝాన్సీరాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, గోపి పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం చారిత్రాత్మకం



మాట్లాడుతున్న బాలస్వామి

నెహ్రూనగర్: దళిత క్రైస్తవుల్ని షెడ్యూల్డ్ కులాల జాబితాలో చేర్చాలని అసెంబ్లీ సమావేశంలో తీర్మానం చేయడం అభినందనీయమని, సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమని రాష్ట్ర క్రైస్తవ నాయకుడు రెవరెండ్ ఫాదర్ డాక్టర్ మద్దు బాలస్వామి పేర్కొన్నారు. నగరంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1950లో అప్పటి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ ఇచ్చిన రాజ్యాంగ ఉత్తర్వులోని 3వ పేరాను తొలగించాలని దళిత క్రైస్తవ సంఘాలు 70 సంవత్సరాలుగా పలు ఉద్యమాలు చేస్తూనే ఉన్నాయని గుర్తు చేశారు. దళిత క్రైస్తవులకు కేంద్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ అవకాశాలు, రాజకీయ అధికార పదవులు, న్యాయ, ఆర్థికపరమైన రక్షణలు కల్పించడంలోనూ అన్యాయం చేస్తోందని విమర్శించారు. ఈనాడు సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దళిత క్రైస్తవులకు అండగా ఉంటూ వారికి ఎస్సీ హోదా కల్పించాలని తీర్మానం చేయడం అభినందనీయమని తెలిపారు. రాష్ట్రంలోని దళిత క్రైస్తవులంతా ఆయనకు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ తీర్మానాన్ని పార్లమెంటులో ఆమోదం తెలిపి దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో క్రైస్తవ సంఘాల నాయకులు కర్రా హనోక్ బెంజిమెన్, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైన్స్ వాచ్‌మన్‌పై దాడి

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలోని ప్రభుత్వ వైన్స్‌లో మద్యం బాటిళ్లు దోచుకునేందుకు ఓ దొంగ ప్రయత్నం చేశాడు. ఈ ఘటన గుంటూరులో బాలురు ఇటీవల చేసిన దొంగతనాల మాదిరిగా ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న ఘటనపై వాచ్‌మన్ యాదల సాంబయ్య తెలిపిన వివరాలు.. రాత్రి 2 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి తాళాలు ఇవ్వాలంటూ గొడవకు దిగి దాడికి పాల్పడ్డారని వివరించాడు. తనను తలపై తీవ్రంగా కొట్టడంతో అక్కడి నుంచి పరారై పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు నిద్ర లేచారని, వచ్చిన ఆ దొంగ భయపడి పారిపోయాడని తెలిపాడు. వెంటనే సమాచారం అందుకున్న దుగ్గిరాల 108 సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి గాయపడిన సాంబయ్యకు ప్రథమ చికిత్స నిర్వహించి తెనాలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైన్స్‌లో వాచ్‌మన్‌పై దాడిచేసిన వ్యక్తిని సీసీ కెమెరాల ద్వారా గుర్తించామని, ఆ దొంగ ఆచూకీ కోసం ప్రత్యేకమైన బృందాలు వెతుకుతున్నాయని ఆయన వివరించారు. జరిగిన ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మినీలారీ ఢీకొని యువకుడి మృతి

ఫిరంగిపురం: వేగంగా వెలుతున్న మినీలారీ దిచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా మరోయువకుడికి తీవ్రగాయాలైన సంఘటన మండల కేంద్రంలోని పెట్రోలు బంకు సమీపంలో శుక్రవారం రాత్రిచోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వేములూరిపాడుకు చెందిన యువకులు ద్విచక్ర వాహనంపై ఫిరంగిపురం వచ్చి తిరిగి వెలుతుండగా పెట్రోలు బంకు వద్ద వేగంగా వస్తున్న మినీలారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈసంఘటనలో జి.సాంబశివరావు (18) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడు దానికి తీవ్రగాయాలు కావడంతో అతడిని 108వాహనంలో చికిత్సనిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు కళాలయ మెలోడీస్ సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియం వేదికగా ఈ నెల 26న సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు కళాలయ మెలోడీస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏవీ రత్నాజీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు విభావరి ప్రారంభమవుతుందని చెప్పారు.

భక్తి శ్రద్ధలతో తొలి శుక్రవారం నమాజ్

విద్యుత్‌కాంతులీనుతున్న మసీదులు



రంజాన్ మాసం సందర్భంగా విద్యుత్ కాంతులీనుతున్న జామియా మసీద్

మంగళగిరి: రంజాన్ మాసం ఉపవాసాలు శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు మధ్యాహ్నం నమాజ్‌కు పెద్ద సంఖ్యలో ముస్లింలు తరలి రావడంతో నగర పరిధిలోని పలు మసీద్‌లు కిటకిటలాడాయి. నగరంలోని జామియా మసీద్, ఈద్గా మసీద్, మసీద్ ఎ అన్వరీలతో పాటు నగర పరిధిలోని నవులూరు, నిడమర్రు, నూతక్కిలలో ముస్లింలు జుమా నమాజ్ ఆచరించారు. యర్రబాలెం మసీద్ ఎ మొహమ్మద్‌లో ఇమామ్ ఫయాజ్ ఆలం ఖుత్బా సందేశమిస్తూ ఖురాన్‌లో అల్లాహ్ సూచించిన విధంగా నడుచుకోవాలన్నారు. రంజాన్ ఉపవాసం డాల్ (ఆయుధం) వంటిదని, భక్తి శ్రద్ధలతో, నియమనిష్ఠలతో ఉపవాసం ఆచరించిన వారికి రయ్యాన్ అనే ద్వారం గుండా స్వర్గప్రవేశం లభిస్తుందన్నారు. కాగా రంజాన్ సందర్భంగా నగరంలోని పలు మసీద్‌లు విద్యుత్‌కాంతులతో ముస్తాబయ్యాయి.

బలమైన రంగంగా తయారీ పరిశ్రమ

- మిశ్రమ పదార్థాలకు పెరిగిన ప్రాధాన్యత
- అపారమైన అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి
- హైదరాబాద్ మిథాని సీఎండీ డాక్టర్ సంజయ్ కుమార్ జా



సదస్సును ప్రారంభిస్తున్న సంజయ్ కుమార్ జా

ఏఎన్‌యూ: తయారీ రంగం నేడు బలమైన రంగంగా ఎదిగిందని హైదరాబాద్ మిథాని సంస్థ సీఎండీ డాక్టర్ సంజయ్ కుమార్ జా తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ కాంపోజిట్ మెటీరియల్స్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. సభకు ముఖ్య అతిథిగా హాజరైన సంజయ్ కుమార్ జా ప్రసంగిస్తూ మిశ్రమ పదార్థాలకు రోజురోజుకూ ప్రాధాన్యత పెరుగుతోందని చెప్పారు. రక్షణ, వైమానిక, అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధలు తదితర రంగాల్లో ఎక్కువగా వాడుతున్నారని తెలిపారు. మిశ్రమ పదార్థాలు, సంబంధిత అంశాలపై విద్యార్థులు మరింత అవగాహన పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. విక్రమ్ సారాబాయ్ అంతరిక్ష కేంద్రం డీడీ డాక్టర్ షాజీ థామస్ ప్రసంగిస్తూ కీలక అంశాలపై విద్యార్థులు పరిశోధనలు చేయాలని సూచించారు. డీఆర్‌డీఓ ఎన్‌ఎస్‌డీఎల్ అసోసియేట్ డైరెక్టర్ పి.వి.ఎస్. గణేష్‌కుమార్, ఆమోర్ టెక్నాలజీ ప్రతినిధి బి. రామకృష్ణ, హైదరాబాద్ ఐఐటీ ఆచార్య కె. భానుశంకర్, ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సిద్ధయ్య, మెకానికల్ విభాగాధిపతి గోపీకృష్ణ, సదస్సు డైరెక్టర్ విజయ ప్రకాష్ ప్రసంగించారు.

సాంకేతికతతో అంతర్జాతీయ వ్యాపారం సులువు

శాస్త్ర సాంకేతిక రంగాల్లో సాధిస్తున్న పురోగతి ఫలితంగా అంతర్జాతీయ వ్యాపారం సులభతరమైందని నాగార్జున యూనివర్సిటీ వీసీ పి. రాజశేఖర్ తెలిపారు. ఏఎన్‌యూ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ బిజినెస్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు జాతీయ సదస్సును శుక్రవారం వీసీ ప్రారంభించారు. ఐఐఎం అహ్మదాబాద్ అధ్యాపకుడు నరసింహన్ రవిచంద్రన్ ప్రసంగిస్తూ వినియోగదారుని అభిరుచులకు అనుగుణంగా ప్రపంచ వ్యాపార పోకడలు నిత్యం నూతనత్వాన్ని సంతరించుకుంటోందని చెప్పారు. ఐఐఎం లక్నో ప్రొఫెసర్ ఎస్. వెంకట్ మాట్లాడుతూ అంతర్జాతీయ వ్యాపార రంగంలో సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. మిజోరాం సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకుడు ఎస్.వి.ఆర్ జ్యోతి కుమార్, ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రి బిజినెస్ విభాగ అధ్యాపకుడు సత్యగోపాల్, పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకుడు శ్రీనివాసులు, సదస్సు డైరెక్టర్ శివరామ ప్రసాద్ మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ కమిషనర్లు యు. హరిప్రసాద్‌రెడ్డి, పి.శామ్యూల్ జోనాథన్ వర్సటీని సందర్శించారు. ఏఎన్‌యూ వీసీ పి.రాజశేఖర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

జర్నలిజం రంగానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి విలువైన సేవలు అందించారని ఏఎన్‌యూ వీసీ పి.రాజశేఖర్ తెలిపారు. దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి మృతి పట్ల ఏఎన్‌యూలో శుక్రవారం వీసీ సంతాపం వ్యక్తం చేశారు.